ఓయూలో పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 5: ఉస్మానియా యూనివర్సిటీలోని వివిధ ఫ్యాకల్టీలలో కేటగిరీ – 1 కింద పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు ఆయా ఫ్యాకల్టీల డీన్లు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంజినీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్, సోషల్ సైన్సెస్, లా, ఇన్ఫర్మేటిక్స్, ఎడ్యుకేషన్ తదితర ఫ్యాకల్టీలలో ఈ కేటగిరీ కింద దరఖాస్తు చేసుకునేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) – జూనియర్ రీసర్చ్ ఫెలోషిప్ (జేఆర్‌ఎఫ్) సాధించిన వారితో పాటు ఇతర సంస్థల నుంచి జాతీయ ఫెలోషిప్ సాధించిన వారు అర్హులని అధికారులు తెలిపారు. ఆసక్తి ఉన్న అర్హులైన అభ్యర్థులు సంబంధిత పత్రాలతో కలిపి ఆయా ఫ్యాకల్టీల డీన్ కార్యాలయంలో ఈ నెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు అర్హులైన వారి జాబితాను 16వ తేదీన విడుదల చేస్తామని, ఇంటర్వ్యూలను 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నిర్వహిస్తామని వివరించారు.

హెచ్-సిటీ పనులకు పాలనా పరమైన అనుమతులు

సిటీబ్యూరో, డిసెంబర్ 5(నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీ పరిధిలో చేపడుతున్న పలు ప్రాజెక్టులకు ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులు మంజూరు చేసింది. హెచ్–సిటీ పేరిట నగరంలోని పలు జోన్ల పరిధిలో ఫ్లై ఓవర్లు, అండర్ పాసులు, రోడ్ల విస్తరణ పనులు చేపట్టేందుకు సన్నాహాలు చేసింది. రూ. 5,942 కోట్ల అంచనా వ్యయంతో నగరంలో చేపట్టనున్న హెచ్ – సిటీ ప్రాజెక్టు అభివృద్ధి పనులను ఆమోదిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ ప్రాజెక్టుల్లో భాగంగా ఖైరతాబాద్ జోన్ పరిధిలో రేతిబౌలి నుంచి నానల్ నగర్ వరకు మల్టీ లెవల్ ఫ్లై ఓవర్, రోడ్డు విస్తరణ పనులు, అదే విధంగా శేరి లింగంపల్లి జోన్ పరిధిలో మల్టీ లెవల్ ఫ్లైఓవర్లు, కూకట్‌పల్లి జోన్ పరిధిలో 236 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మాణం, సికింద్రాబాద్ జోన్ పరిధిలో ఆర్‌వోబీలు, రసూల్‌పురా వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణం, ఎల్బీనగర్ జోన్ పరిధిలో 416 కోట్లతో ఫ్లైఓవర్, చార్మినార్ జోన్ పరిధిలో మూడు ప్యాకేజీల్లో రూ. 1461 కోట్లతో ఫ్లై ఓవర్లు, అండర్ పాసులు, రోడ్ల విస్తరణ పనులు చేయనున్నారు.

ఎంఈడీ, ఎంపీఈడీ తుది సీట్ల కేటాయింపు జాబితా విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 5: రాష్ట్ర వ్యాప్తంగా ఎంఈడీ, ఎంపీఈడీ సీట్ల తుది కేటాయింపు జాబితాను విడుదల చేసినట్లు సీపీజీఈటీ – 2024 కన్వీనర్ ప్రొఫెసర్ ఐ.పాండురంగారెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 583 మంది వెబ్ ఆప్షన్లను ఎంపిక చేసుకున్నారని చెప్పారు. వారిలో 193 మందికి సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు తమ కళాశాలల్లో ఈ నెల 9వ తేదీలోగా సంబంధిత ఫీజు చెల్లించి, ఒరిజినల్ టీసీ సమర్పించి స్వయంగా రిపోర్టు చేయాలని సూచించారు.

ఏటా 90 మందికి శిక్షణను ఇచ్చేలా..

ఎంఎల్ఆర్ఐటీలో సివిల్ సర్వీసెస్ విద్యార్థులకు అవగాహన

నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ నిర్వహణ

సెమినార్‌లో పాల్గొన్న ఎంఎల్ఆర్ఐటీ కళాశాల చైర్మన్ లక్ష్మణ్ రెడ్డి, రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ ప్రతినిధులు

దుండిగల్, డిసెంబర్ 5: ప్రతి సంవత్సరం 90 మందిని అఖిల భారత ఉద్యోగాలకు సంబంధించి శిక్షణను అందించేలా 'తెలంగాణ టుడే, నమస్తే తెలంగాణ' దిన పత్రికలు పూనుకున్నాయి. నగర శివారు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్‌లోని మర్రిలక్ష్మణ్ రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఎల్ఆర్ఐటీ) కళాశాలలో గురువారం 'తెలంగాణ టుడే, నమస్తే తెలంగాణ' దిన పత్రికల సంయుక్త ఆధ్వర్యంలో 'సివిల్ సర్వీసెస్ – ది గోల్ కెరియర్ ఫర్ ఏ ఫ్రెష్ గ్రాడ్యుయేట్' పేరిట సెమినార్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 2014 యూపీఎస్సీ విజేత, రక్షణ మంత్రిత్వ శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్, రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ చీఫ్ మెంటర్ డాక్టర్ జి.వివేకానంద హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యూపీఎస్సీ ప్రక్రియను, పరీక్షను ఎదుర్కొనే విధి విధానాలు, విజయాన్ని సాధించే మార్గములను, విలువైన సూచనలు అందజేశారు. సివిల్ సర్వీసెస్ ద్వారా సమాజానికి సేవ చేసే అవకాశం లభిస్తుందని, తమ రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ లక్ష్యం ప్రతి సంవత్సరం 90 మంది అభ్యర్థులను ఎంపిక చేసి వారిని పరీక్షకు సిద్ధం చేయడం, 2030వ సంవత్సరం నాటికి 100 మంది ఐఏఎస్, 100 మంది ఐపీఎస్ అధికారులను తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్, శ్రీరమణ ముప్పాళ్ల యూపీఎస్సీ పరీక్షా ప్రక్రియను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరిస్తూ, విద్యార్థుల విజయానికి ఒక రోడ్ మ్యాప్ సూచించారు. ఎంఎల్ఆర్ఐటీ కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ, తెలంగాణ పబ్లికేషన్స్ ప్రతినిధుల సమక్షంలో, రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ రూపొందించిన ప్రత్యేక యూపీఎస్సీ పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ పుస్తకాలను విద్యార్థుల కోసం గ్రంథాలయంలో అందుబాటులో ఉంచుతామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్, డా. కె.శ్రీనివాస రావు, పీఆర్వో డా. వై.రఘునాథ్, హెచ్‌ఓడీ డా. కె.ప్రసాద్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సివిల్స్ అభ్యర్థులకు ఉపయోగకరం: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి ఎమ్మెల్యే, ఎంఎల్ఆర్ఐటీ కళాశాల వ్యవస్థాపక కార్యదర్శి మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే దిన పత్రికల ద్వారా ఏర్పాటు చేసిన ఈ సెషన్ విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉందని, ఈ సెమినార్ నిర్వహణతో తమ కళాశాల విద్యార్థులు సివిల్ సర్వీసెస్‌లో ర్యాంకులు సాధించడానికి ప్రోత్సాహం అందిస్తుందని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ సాహితీ కీర్తి కిరీటం కపిలవాయి

లింగమూర్తి తైలవర్ణ చిత్ర పటాన్ని ఏర్పాటు చేయాలి

తెలంగాణ విశ్వ బ్రాహ్మణ, విశ్వకర్మల విజ్ఞప్తి

సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. నామోజు బాలాచారిని సత్కరిస్తున్న వేములవాడ మదన్ మోహన్, లాలుకోట వెంకటాచారి, చొల్లేటి కృష్ణామాచార్యులు

రవీంద్రభారతి, డిసెంబర్ 5: తెలంగాణ సాహితీ కీర్తి కిరీటం ఉమ్మడి మహబూబ్‌నగర్ పాలమూరు జిల్లా వాసి సుప్రసిద్ధ చరిత్ర నిర్మాతలు, కవి, రచయిత దివంగత కపిలవాయి లింగమూర్తి తైలవర్ణ చిత్రపటాన్ని తెలంగాణ సాహిత్య అకాడమీలో ఏర్పాటు చేయాలని తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు అకాడమీ కార్యాలయంలో కార్యదర్శి నామోజు బాలాచారికి విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్ మోహన్, గౌరవ అధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణామాచార్యులు, కోశాధికారి రాగిఫణి రవీంద్రాచార్యులు, నామోజు బాలాచారికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కపిలవాయి లింగమూర్తి ప్రభుత్వ పరంగా, తెలుగు రాష్ట్రాలలోని సీఎంలు, విశ్వవిద్యాలయాలు, వివిధ సాహిత్య సంస్థలు వారికి అందించిన అవార్డులు, రివార్డులు, రచనలు, సమగ్ర వివరాలతో కూడిన వినతి పత్రాన్ని కార్యదర్శికి అందజేశారు. సాహితీవేత్తలైన మహానుభావుల సరసన మహబూబ్‌నగర్ జిల్లా ముద్దుబిడ్డ కపిలవాయి లింగమూర్తి తైలవర్ణ చిత్ర పటాన్ని సాహిత్య అకాడమీలో ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసాచారి, జగ్జీవన్ చారి, బిక్షపతిచారి, బ్రహ్మచారి, లక్ష్మణాచారి, లక్ష్మిరామాచారి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కార్మికులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాం

బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్

నామినేషన్ పత్రాలను అందజేస్తున్న రాంబాబు యాదవ్

చిక్కడపల్లి, డిసెంబర్ 5: కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేశామని, కార్మికులకు ఇచ్చిన హామీ అమలు చేశామని వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ తెలంగాణ అధ్యక్షుడు, బీఆర్‌టీయూ అధ్యక్షుడిగా రాంబాబు యాదవ్ అన్నారు. వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ (2873) యూనియన్ గుర్తింపు ఎన్నికలకు గాను యూనియన్ అధ్యక్షుడిగా రాంబాబు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఎం.మల్లయ్యలు గురువారం కార్మిక శాఖ కార్యాలయంలో జంట నగరాల సంయుక్త కార్మిక కమిషనర్ సునీత గోపాల్ దాస్‌కు నామిషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు యాదవ్ మాట్లాడుతూ, ఎమ్మెల్సీ కవిత, గౌరవ అధ్యక్షుడు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సారథ్యంలో రెండుసార్లు గెలిచి కార్మికులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామన్నారు. కార్మికులు సంక్షేమ కోసం చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కాంగ్రెస్ అనుబంధ యూనియన్ నేడు కార్మికులు భయబ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. అధికార పార్టీలో ఉంటే పనులు అవుతాయని భ్రమ పెడుతున్నారని వివరించారు. కార్మికులకు హెల్త్ కార్డు అందించామని, ప్రమోషన్ల సమస్య పరిష్కరించాము, పీఆర్‌ఎస్ ధర్నాలకు లేకుండా సాధించుకున్నామని తెలిపారు. అక్రమ ట్రాన్స్‌ఫర్లకు అడ్డుకట్ట వేయడం జరిగిందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన సౌకర్యాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించకుండా రద్దు చేసే కుట్ర చేస్తోందని తెలిపారు. ఇలాంటి సందర్భంగా మరోసారి కార్మికులు ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జి.లక్ష్మీనారాయణ, మేడ్చల్ శ్రీనివాస్, కోకాపేట జంగయ్య, జమీల్ అహ్మద్, రాంచంద్రారెడ్డి, వెంకటేశ్ యాదవ్, కిషన్, జ్ఞానేశ్వర్, రాజ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఉదయ్, కమార్, రామస్వామి, నిరంజన్, శివారెడ్డి, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

జల మండలిలో టెండర్ కహానీ!

అమృత్-2 ఎస్టీపీల పనులపై అనుమానాలు

సిటీబ్యూరో: మూసీ నది ప్రక్షాళనలో భాగంగా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని చేపడుతున్న అమృత్–2 పథకం పనులకు ప్రభుత్వం ఆదిలోనే అపసోపాలు పడుతున్నది. టెండర్ల ప్రక్రియను ముగించుకుని పనులు పట్టాలెక్కాల్సిన చోట ఏజెన్సీలు ఈ ప్రాజెక్టు పనులకు ముందుకు రావడం లేదు. ప్యాకేజీ–2లోని రూ. 1388.22 కోట్లతో 22 చోట్ల ఎస్టీపీ పనులతో పాటు 15 సంవత్సరాల నిర్వహణకు మొదటి విడత టెండర్‌కు ఏజెన్సీల నుంచి ఒక్క బిడ్ కూడా దాఖలు కాలేదు. టెండర్‌లో పేర్కొన్న రేట్లతో పనులు చేపట్టడం సాధ్యం కాదని కొన్ని ఏజెన్సీలు చెబుతున్నట్లు బోర్డు వర్గాలు తెలిపాయి. దీంతో పాటు హెచ్‌ఏఎం మోడ్‌లో ఈ పనులు ఇప్పుడున్న పరిస్థితుల్లో చేపట్టడం వీలు కాదని పేర్కొన్నట్లు అధికార వర్గాలు చెప్పాయి. ఈ నేపథ్యంలోనే గత నెల మొదటి వారంలో మొదటి టెండర్ పిలవగా, ఏజెన్సీలు ముందుకు రాకపోవడంతో తిరిగి గత నెల 30న రెండో సారి టెండర్ పిలవగా, ఈ నెల 9వ తేదీ వరకు తుది గడువుతో మళ్లీ పిలిచారు. ఈ పనులకు ఏజెన్సీలు ఆసక్తి చూపకపోవడంతో ప్రస్తుతం మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టు ప్రశ్నార్థకంగా మారింది.

అనేక సందేహాలు..

ప్యాకేజీ–2 పనులకు పత్రికల్లో టెండర్ నోటిఫికేషన్ ప్రకటించి ఆన్‌లైన్‌లో టెండర్ వివరాలను పొందుపరుస్తామని చెప్పారు. కానీ వారం దాటినా.. ఆన్‌లైన్‌లోకి టెండర్ డాక్యుమెంట్స్ రాలేదు. అమృత్ గైడ్‌లైన్స్, డాక్యుమెంట్స్ అప్‌లోడ్‌లో సమయం అంటూ.. చెప్పుకొచ్చారు. ఆ తర్వాత 20 రోజుల సమయంలో పనులు చేపట్టేందుకు ఏ ఒక్కరూ ముందుకు రాలేదని తాజాగా రెండోసారి టెండర్ ఆహ్వానించారు. అయితే మొదటిసారి పిలిచినప్పుడు టెండర్ (ప్రాజెక్టు) వాల్యూ రూ.1388. 22కోట్లు (ఎస్టీపీల నిర్మాణ వ్యయం రూ. 846.67, 15 సంవత్సరాల నిర్వహణకు రూ. 541.55 కోట్లు) ఉంటే రెండోసారి పిలిచిన టెండర్‌లో ప్రాజెక్టు వాల్యూ రూ. 1315.22 కోట్లుగా(నిర్మాణ వ్యయం రూ. 773.67 కోట్లు, నిర్వహణకు రూ. 541.55 కోట్లు) పేర్కొన్నారు. నిర్మాణ వ్యయంలో ఏకంగా రూ. 73 కోట్ల మేర తగ్గించడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

ప్యాకేజీ-2 పనుల వివరాలు

మూసీ నది ప్రక్షాళనలో భాగంగానే రూ. 3784 కోట్ల అంచనా వ్యయంతో 965 ఎంఎల్‌డీల సామర్థ్యంతో కొత్తగా మరో 39 ఎస్టీపీల ప్రాజెక్టుకు జలమండలి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రెండు ప్యాకేజీలకు టెండర్లు పిలిచారు. అమృత్ పథకం కింద కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ 39 ఎస్టీపీల ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. ప్యాకేజీ–2లో భాగంగా 471.50 ఎంఎల్‌డీ సామర్థ్యంతో 22 ఎస్టీపీల పనులకు టెండర్లు పిలిచారు. ఎస్టీపీ నిర్మాణ పనుల్లో భాగంగా పీర్జాదిగూడ (61 ఎంఎల్‌డీ), కొర్రెముల 34.50, నాగారం లేక్ 47.50, చేర్యాల లేక్ 6.50, కుందన్‌పల్లి 9, యానంపేట 26, కుంట్లూరు 31.50, గౌరెల్లి 7, ఈదుల చెరువు 23.50, పల్లె చెరువు 13.50, ఉమ్డాసాగర్ 23.50, బండ్లగూడ 5.50, గుర్రంచెరువు 19.50, మీర్‌పేట తలాబ్ ఎస్టీపీ 18, సందన చెరువు 20, రావిర్యాల్ 12, బొంగుళూరు 5.50, మాసబ్ చెరువు 36.50, కోత్వాల్‌గూడ 1, లేక్ కామిని 2.50, హైదర్షకోట్ 36.50, సంగం బాపుఘాట్ 31 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఈ ఎస్టీపీ నిర్మాణం జరుగనున్నది.

కేబీఆర్‌లో పీకాక్ ఫెస్టివల్

తెలంగాణ వైల్డ్ లైఫ్ చీఫ్ వార్డెన్ ఏలూసింగ్ మేరు

హైదరాబాద్, డిసెంబర్ 5(నమస్తే తెలంగాణ): రాజధాని హైదరాబాద్ మధ్యలో ప్రకృతి మణిహారంలా ఉన్న కాసు బ్రహ్మానంద రెడ్డి జాతీయ ఉద్యానవనం (కేబీఆర్ పార్క్)లో పీకాక్ డే ఫెస్టివల్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. 1998లో కేంద్ర ప్రభుత్వం ఈ అటవీ ప్రాంతాన్ని నేషనల్ పార్క్‌గా ప్రకటించింది. సుమారు 380 ఎకరాల్లో విస్తరించిన కేబీఆర్ పార్క్ అటవీ ప్రాంతం అభివృద్ధి చెందిన హైదరాబాద్‌కు సహజ ఆక్సిజన్ వనరుగా పనిచేస్తోంది. నిత్యం వందలాది మంది సందర్శకులు, వాకర్స్‌కు కేబీఆర్ పార్క్ ప్రకృతి అందాలను పంచటంతో పాటు విభిన్న జీవ వైవిధ్యంతో పర్యావరణ ప్రాధాన్యతను తెలుపుతోంది. ఈ పార్క్‌లో విరివిగా కనిపించే జాతీయ పక్షి నెమలి పేరు మీదే ఆవిర్భావం రోజు పీకాక్ డే నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. ఈ యేడాది ఉత్సవాలను వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల నుంచి తరలివచ్చిన విద్యార్థుల మధ్య అటవీ శాఖ ఘనంగా నిర్వహించింది. స్కూలు పిల్లలకు డ్రాయింగ్, పెయిటింగ్, ఇతర పోటీలను నిర్వహించి అధికారుల చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట పాటలు, ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ సభ్యుల స్నేక్ షో అలరించాయి. ముఖ్య అతిథిగా ఇందుకు హాజరైన పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) ఏలూసింగ్ మేరు మాట్లాడుతూ, కేబీఆర్ పార్క్ రాజధాని హైదరాబాద్‌కు ప్రకృతి – పర్యావరణ నిధిగా పనిచేస్తోందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్న అర్బన్ పార్కులు మరింతగా పచ్చదనం పంచుతూ పరిసర ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన ఆక్సీజన్‌ను అందిచటంతో పాటు పర్యావరణ ప్రాముఖ్యతను చాటుతున్నాయన్నారు. హైదరాబాద్ చార్మినార్ సర్కిల్ సీసీఎఫ్ ప్రియాంక వర్గీస్ మాట్లాడుతూ, కేబీఆర్ పార్క్ విశిష్టతను కాపాడుతూనే ఇక్కడికి వచ్చే సందర్శకులు, వాకర్స్‌కు తగిన సౌకర్యాలు అందిస్తామన్నారు. జిల్లా అటవీ అధికారి సుధాకర్‌రెడ్డి నేతృత్వంలో రూపొందించిన పార్క్ ప్రత్యేక బ్రోచర్‌ను ఈ సందర్భంగా అధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైల్డ్ లైఫ్ ఓఎస్‌డీ శంకరన్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అటవీ అధికారులు, కేబీఆర్ పార్క్ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చార్మినార్ సర్కిల్ సీసీఎఫ్ ప్రియాంక వర్గీస్, చిత్రంలో తదితరులు, నెమలి పింఛాలు ధరించిన విద్యార్థులు

ఎస్కే మిశ్రోకు చాట్ల శ్రీ ప్రతిభా పురస్కారం

రూ. 20 వేల నగదుతో మిశ్రోను సత్కరించిన వక్తలు

ఎస్కే మిశ్రోకు పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరిస్తున్న రమణాచారి తదితరులు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 5: రసరంజని, చాట్ల శ్రీరాములు థియేటర్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో చాట్ల శ్రీరాములు 93వ జయంత్యుత్సవాలు గురువారం సాయంత్రం పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించారు. తెలుగు నాటక రంగానికి విశేషంగా కృషి చేస్తున్న ప్రఖ్యాత రంగస్థల, టీవీ, చలనచిత్ర నటుడు, దర్శకుడు ఎస్కే మిశ్రోను 2024కు గాను చాట్ల శ్రీరాములు పేరిట నెలకొల్పిన ప్రతిభా పురస్కారం ప్రదానం చేశారు. పురస్కారం కింద రూ.20 వేల నగదు, ప్రశంసా పత్రం, శాలువాతో మిశ్రోను సత్కరించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ, నాటక రంగమే తపస్సుగా భావించి చేసిన కృషికిగాను చాట్ల శ్రీరాములు ఎన్నో అవార్డులు, పురస్కారాలు అందుకున్నారని పేర్కొన్నారు. చాట్ల శ్రీరాములు నేటి తరం నాటక రంగ కళాకారులు, నిపుణులకు మార్గదర్శకులని అన్నారు. నాటక రంగాన్ని ప్రోత్సహించాలనే ఆశయం కలిగిన బొల్లినేని కృష్ణయ్య వచ్చే ఏడాది నుంచి ఈ పురస్కారాన్ని రూ.50 వేలకు పెంచేందుకు తాను తోడ్పాటును అందిస్తానని చెప్పడం పట్ల రమణాచారి హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్ర నాటక కళా పరిషత్ అధ్యక్షులు బొల్లినేని కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రంగస్థల నటులు ఉప్పులూరి సుబ్బరాయ శర్మ, నాటక రచయిత బుర్రా సాయిమాధవ్, నవ్య వార పత్రిక పూర్వ సంపాదకులు ఏఎస్ జగనాథశర్మ, రస రంజని కార్యదర్శి కేతినీడి నటరాజు, రామకోటేశ్వర రావు, అరుణ్ కుమార్, నారాయణ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమాజంలోని సమస్యలకు అద్దంపట్టే అంశాలతో యువభేరి థియేటర్ నిర్వహణలో అక్కల తామేశ్వరయ్య రచించిన వడ్డాది సత్యనారాయణ దర్శకత్వంలో 'నా శత్రువు' నాటికను పలువురు నటీనటులు వేదికపై ప్రదర్శించి మెప్పించారు.

డైలీ సీరియల్‌లా..

చెరువుల హద్దుల నిర్ధారణను సాగదీస్తున్న హెచ్‌ఎండీఏ

3వేలకుపైగా ఉన్న తటాకాల్లో హద్దులు.. నిర్ధారించి కేవలం 570లకే

సిటీబ్యూరో, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : హెచ్‌ఎండీఏ పరిధిలో చెరువులు, కుంటల ఫుల్ ట్యాంక్ లెవల్, బఫర్ జోన్ నిర్ధారణ డైలీ సీరియల్‌లా మారింది. ఓవైపు చెరువుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రచారం చేసుకుంటుంటే... మరోవైపు చెరువుల పరిరక్షణలో కీలకమైన హద్దుల నిర్ధారణ ఏడాది కాలంగా సాగుతూనే ఉంది. మొత్తం 3500కు పైగా ఉన్న చెరువుల్లో కనీసం 30 శాతం చెరువులకు కూడా హద్దులను గుర్తించలేకపోయారు. హెచ్‌ఎండీఏ పరిధిలో చెరువుల హద్దుల గుర్తింపు ప్రక్రియను లేక్ విభాగం అధికారులు సాగదీస్తున్నారు. గడిచిన నాలుగు నెలలుగా గడువు పొడిగించాలని కోరుతున్నారే తప్ప.. హైకోర్టు నిర్దేశించిన గడువులోగా అన్ని చెరువులకు హద్దులు, బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌ను మాత్రం గుర్తించడం లేదు.

లేక్‌సిటీగా పేరొందిన నగరం..

లేక్ సిటీగా పేరుగాంచిన హైదరాబాద్ నగరంలో చెరువుల పరిరక్షణ ప్రక్రియ టైం ల్యాప్స్ కార్యక్రమంలా మారిపోతున్నది. గడిచిన కొన్నేండ్లుగా ఈ వ్యవహారం నడుస్తూనే ఉన్నది. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలతో సమన్వయంలో చేసుకోవడం హెచ్‌ఎండీఏ విఫలమవుతుండటంతో.. చెరువుల హద్దుల నిర్ధారణ తీవ్ర జాప్యం జరుగుతున్నది. ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రంగా చెరువుల పరిరక్షణపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలతో ఊదరగొడుతున్న తరుణంలో.... అధికారుల పనితీరు కూడా అందుకు తగినట్లుగానే ఉన్నదనే విమర్శలొస్తున్నాయి. హెచ్‌ఎండీఏలోని లేక్ విభాగం ఈ చెరువులకు సంబంధించిన వ్యవహారాలను పర్యవేక్షిస్తుండగా... జవసత్వాలు లేకుండా నత్తనడకన ఈ ప్రక్రియ నడుస్తోంది.

నాలుగు నెలలుగా 570 చెరువులే..

మొత్తం హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న 3500కు పైగా చెరువులకు డిసెంబర్ 30లోగా హద్దులను నిర్ధారించాలని ఇటీవలే హైకోర్టు ఆదేశించింది. కానీ ఈ వ్యవహారంలో హెచ్‌ఎండీఏ లేక్ విభాగం నిర్లక్ష్యం హద్దుల నిర్ధారణ పూర్తి కావడం లేదు. మొత్తం చెరువుల్లో 2700 చెరువులకు మాత్రమే హద్దుల నిర్ధారణ చేసి ప్రాథమిక నివేదిక రూపొందించగా, కేవలం 570 చెరువులకు మాత్రమే తుది నోటిఫికేషన్ జారీ చేసినట్లు హెచ్‌ఎండీఏ వెల్లడించింది. ఈ క్రమంలో దాదాపు మూడు వేల చెరువులకు హద్దులను నిర్ధారిస్తూ ఫైనల్ నోటిఫికేషన్ చేయాల్సి ఉంది.

సర్కారు దవాఖానల్లో మందుల్లేవ్

తీవ్ర ఇబ్బందులుపడుతున్న రోగులు

మేడ్చల్: సర్కారు వైద్యశాలల్లో మందుల కొరతతో రోగులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ప్రస్తుతం వైద్యశాలల్లో పారాసిటమల్ తప్ప.. ఇతర మందులేవీ లేకపోవడంతో రోగులకు వైద్యులు జనరిక్ షాపుల్లో కొనుగోలు చేసుకునేలా మందులు రాసిస్తున్నారు. మేడ్చల్ జిల్లాలో జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానతో పాటు 103 పల్లె, 71 బస్తీ దవాఖానలతో పాటు మూడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 26 యూపీహెచ్‌సీలు ఉండగా, 24 గంటలు పని చేసే 13 దవాఖానల్లో 8 పీహెచ్‌సీలు, 5 యూపీహెచ్‌సీలు ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె, బస్తీ దవాఖానల్లో ప్రతి రోజూ 100 నుంచి 200 మంది వరకు వైద్య సేవల కోసం ఓపీకి వస్తుంటారు. మిగతా ప్రభుత్వ దవాఖానల్లో అన్ని కలిపి సుమారు 5 వేల మందికి ప్రజలు వస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో మందుల కొరత ఉండటంతో రోగులు తీవ్రంగా ఇబ్బందులుపడుతున్నారు. మరోవైపు సర్కారు దవాఖానల్లో పలు పోస్టులు ఖాళీగా ఉండటంతో వైద్యసేవలు కూడా అంతంత మాత్రంగానే అందుతున్నాయి.

అరాచక హస్తం.. హడలెత్తిన జనం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటంలో రాక్షస హస్తం దర్శనమివ్వడంతో ఉప్పల్ వాసులు విస్తుపోయారు. ప్రజాపాలన ఉత్సవాల్లో భాగంగా ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోను ముద్రిస్తూ..ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. కాగా, రేవంత్‌రెడ్డి చేయి రాక్షస హస్తాన్ని పోలి ఉండటంతో గురువారం ఉదయం ఉప్పల్ సర్కిల్ కార్యాలయానికి వచ్చిన కాలనీవాసులు, సందర్శకులు గురువారం సీఎం ఫ్లెక్సీని చూసి.. ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న అధికారులు.. హడావిడిగా సిబ్బందితో ఫ్లెక్సీని తీసి వేయించారు. మరో ఫొటోతో ఫ్లెక్సీని ముద్రించి ఏర్పాటు చేశారు.

– ఉప్పల్, నవంబర్ 5 :